శ్రీ పక్షిలింగ శతకము

13405

శ్రీ రస్తు

శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః.

శ్రీ సాక్షిలింగ శతకము.

ఇది

శ్రీమత్సకలసంపద సమన్వితంబగు
విశాఖపట్టణ నివాసుండును, వీరరాఘవ
గోత్రోద్భవుండును, కొప్పులవంశాబ్ధి
శీతకరుండును, శ్రీ సూరయాఖ్య సుతుండును,
సచ్చిదానంద రహితుండును,
శింపల్లి చిన్నయార్య శిష్యుండును నగు

కొప్పుల ఆదినారాయణచే

రచింపబడి

విశాఖపట్టణంబున
శ్రీ శారదాముకుట ముద్రాక్షరశాలయందు
ముద్రింపించి ప్రకటింపంబడియె.
1918.

కాపీరైట్ - రిజస్టర్డు.

వెల 1 అణా.

పీఠిక.

శ్రీపరమేశ్వర పాదారవిందసేవాధురీణులును. స
ఖలవిద్యాపాండిత్య నిపుణులును నగు సోమాకలేయులా
రా- నేను బాల్యమునుండియు శ్రీభగవచ్చింతాపరా
యణుడనై యుండుతరి దైవకృపచే శ్రీమద్విశాఖపట్టణ
నివాసులును సకలసద్గుణాతీత నిష్ఠాగరిష్ఠవరిష్ఠులును
ప్రకృతిద్వయదోష రహితులును నగు భీంపల్లి చిన్న
య్యగారి పరిపూర్ణకటాక్షము బొందు భాగ్యము నాకు
లభింప తద్వేదాంత మార్గమును నాకు తెలిసినంతమ
ట్టుకు సాక్షిలింగశతకమను పేర కవిత్వనిపుణత్వము
లేని నేను ఈచిన్నిపుస్తకమును రచించినాడ. నాకు
చిరస్నేహితులగు కొందరి ప్రోత్సాహ సహాయముల
వలన నచ్చొత్తించితి గావున జ్ఞానరహితుండనగు నే
జేయు పద్యములయందలి తప్పుల మన్నింప బ్రార్థింపు
చున్నాడను.

విశాఖపట్టణము,
1-8-18.

ఇట్లు సుజనవిధేయుడు,
కొప్పుల ఆదినారాయణ,
రంగిరీజువీధి.

ఓం

శ్రీ సద్గురుపరబ్రహ్మణేనమః.

శ్రీ సాక్షిలింగ శతకము.

ఆ॥ శ్రీయుమాపతి సర • సీరుహములగొల్చి
పరమపావనమగు • బ్రహ్మభావ
మిటుల జెప్పినాడ • నీశ్వరార్పితముగ
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 1

సీ॥ శ్రీమహేశునిజింత • జేసెడినరులతో
బరగు శ్రీవైశాఖ • పురవరుండ
సతతంబు కీర్తిని • చాలగనిచ్చు శ్రీ
వీరరాఘవగోత్రి • వంశజుండ
సుగుణయుతుండగు • సూరయనాతండ్రి
యలమహాలక్ష్మికి • నాత్మజుండ
సుజ్ఞాని భీంపల్లి • చిన్నయ్యగురుకృప
నజ్ఞానమునుబాసి • యలరువాడ

ఒప్పుమీరనేను • కొప్పులవంశాబ్ధి
సీతకరుడనగుచు • జెలగుచుందు
నామమునను ఆది • నారాయణుండను
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 2

ఆ॥ ఎంచదీపకళిక • యించుకమైనను
కాంతి యిల్లునిండ • క్రమ్ముభంగి
నాదుకవితనెగడ • నేజేతుగురుస్తుతి
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 3

ఆ॥ పాలగ్రోలినీరు • పరగవిడుచుహంస
లీలనేనుజెప్పు • నీతివాక్య
సరణియందుతప్పు • సైరించిబ్రోవవే
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 4

ఆ॥ తెలిసినట్లునేను • తెలిపితినీగతి
గాన తప్పుసైచి • గాచుకొరకు
సుజనప్రార్థనంబు • సలిపెద నిప్పుడే
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 5

ఆ॥ బయలులోను గలిగె • బరమాత్మయనువిత్తు
అంతరాత్మజ్యోతి • అణువుసాక్షి
ప్రబలివృక్షమగుచు • బయలును గప్పెరా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 6

ఆ॥ గగనమందువిత్తు ♦ ఘనముగావిలసిల్లి
జగములోన వేరు ♦ జొరగనవుడు
గగనమందు పండు ♦ ఘనముగాపండెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 7

ఆ॥ పండుయందు ప్రణవ ♦ పరమాత్మ యేవిత్తు
పంచవింశితంబు ♦ పైనితోలు
పండులోననుండు ♦ బ్రహ్మాండమంతయు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 8

ఆ॥ జలమునందు నువ్వు ♦ జననమొందినయట్లు
కట్టెయందునగ్ని ♦ కలిగినట్లు
పూర్ణమందు నెరుక ♦ పుట్టినట్లాయెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 9

ఆ॥ వాయువాకసంబు ♦ వనర తేజంబప్పు
పృథ్వినైదుగలసి ♦ భూతములుగ
ఓమ్మనుపలుకిట్లు ♦ వరలుచునుండెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 10

ఆ॥ ప్రణవమందు నైదు ♦ ప్రాణాక్షరాల్ పుట్టి
ప్రభలనాయెజగతి ♦ ప్రాణికోట్లు
నీడజీవుడాయె ♦ నిల్కడే శివుడాయె
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 11

ఆ॥ ఆకసమునసూర్యు • డాగి నిలచినట్లు
నిండుకుండనీళ్ల • నిలుచునట్లు
మాయఘటములందు • మాహేశుడిట్లుండు
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 12

ఆ॥ కొండలేదుపైని • కోటిభానుల వెల్గు
అండఛాయకాత్మ • ననుసరించి
యేదుకొండలెక్క • యేర్పాటు నెరుగరా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 13

ఆ॥ వేయిదళములందు • వేదాంత వేద్యుండు
స్వామిసద్గురుండు • సాక్షిగాను
యిలను దేవగణము • లితనిప్రభావమే
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 14

ఆ॥ ఘటమువందునేడు • గనుపట్టిమఠములు
నిలకడెరిగి నిలువ • నిటలమందు
నిటలమందు నిలచి • నీవెవ్వరోచూడు
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 15

ఆ॥ నిటలమధ్యదృష్టి • నిలపగానేస్తరా
కుటిలగుణములన్ని • గూల్చుకున్న
పటుతరైక్యబ్రహ్మ • భావంబుగల్గునా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 16

ఆ॥ గుడ్లగూబ పగలు • గుర్తెరుంగనియట్లు
కలకఁండ్లు జ్యోతి • గానవట్లు
మూఢజనుడు మూల • మూర్తి నిగాంచునా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 17

ఆ॥ గురు తెలియని వాడు • గురుపుత్రుడట్లావు
లోకమాయ తొటుల • లేకపోవు
జీవయోగులదగు • జీకాకువిడదావు
సర్వపావభంగ • సాక్షిలింగ॥ 18

ఆ॥ తనువు చెట్టుజేసి • తాను పేటుకులేచి
మాయమోకము తొరకు • మాటుగాచి
గురుకటాక్ష మనెడి • గుండుతో గొట్టరా
సర్వపావభంగ • సాక్షిలింగ। 19

ఆ॥ వేయిమూలికములు • వేసిన మొతలోను
కర్మసంచితంబు • కాలిపోదు
కాల్చివేయుజ్ఞాన • కాంతినిగనవలె
సర్వపావభంగ • సాక్షిలింగ। 20

ఆ॥ ఆత్మగననివాడు • హరికాను డెటులాయె
కామక్రోధము లెట్లు • కాలిపోవు
ఆ హరికృతి పేర • యాచించుటేవృత్తి
సర్వపాపభంగ • సాక్షిలింగ। 21

ఆ॥ రంభమగనిజూచి • రంజిల్లి మదవతి
యింటిమగని తాను • విడచినట్లు
రామభక్తి విడచి • రంజిల్లు హరిదాసు
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 22

ఆ॥ తాళ నృత్య వాద్య • తంబూరముల్ బట్టి
పాడినంత నె కర్మ • బాసిపోదు
బాసిపోవుబ్రహ్మ • భావంబుగనవలె
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 23

ఆ॥ తల్లి యంగమామె • తనయుడు లింగంబు
అంగ లింగ సంగ • మమర దెలియ
నంతరంగమందు • నంతతా నానయా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 24

ఆ॥ తల్లి శక్తి రూపు • తనయుడు శివరూపు
ఆలిమగని వరుస • లారయజూడు
పటుతరైక్యమొంద • పరమాత్మ తద్రూపు
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 25

॥ చదువులందుగాదు • శాస్త్రంబులనుగాదు
శ్లోక వేదపఠన • శోధిగాదు
పదవిబడయు కోరకు • పరమార్ధరతిముక్తి
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 26

ఆ॥ పట్టుపంచగట్టి ♦ పై భక్తినిల్పినా
భక్తిగాదు లోక ♦ భ్రాంతిగాని
లోకభ్రాంతి వలన ♦ లోవెలిబాయునా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 27

ఆ॥ పట్టివర్ధనములు ♦ పెట్టగానేనరా
మెట్టివాడో తన్ను ♦ నెరుగడేని
చిన్నె లెన్ని యున్న ♦ శ్రీహరి మెచ్చునా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 28

ఆ॥ పనలుదన్ని కొమ్ము ♦ పై కివచ్చినయట్లు
పుష్పమందు తేనె ♦ పుట్టినట్లు
భక్తిలోనబుట్టి ♦ బరమాత్మ గనవలె
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 29

ఆ॥ భారతంబుగాదు ♦ భాగవతముగాదు
గాదు సర్వస్మృతి ♦ గాథగాదు
స్మృతులకందనట్టి ♦ సూత్రధారుండయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 30

ఆ॥ చిన్న పెద్దలందు ♦ చిన్మయజ్యోతుండు
విస్మయంబు వేద ♦ యాస్పదంబు
అహం బ్రహ్మాయస్మి ♦ ఆత్మస్వరూపంబు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 31

ఆ॥ దేవు డన్ని యెడల ♦ దీరుగ నుండగా
వెత్తికుక్కరీతి ♦ వెదుక నేల
అడవులంటబోవు ♦ నాతడా సుజ్ఞాని
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 32

ఆ॥ గృహమువిడచి కొండ ♦ గుహలలోగుండిన
దన్ను దెలియలేని ♦ తప మదేల
బండమీద బండ ♦ భ్రమ బుట్టగాబోలు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ। 33

ఆ॥ మనసు దెలియలేక ♦ మమత చే నజ్ఞాని
వెళ్ళి యడవులంట ♦ వెతలుజెందు
క్షుత్పిపాసవల్ల ♦ చెడిపోవు జ్ఞానంబు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 34

ఆ॥ హంసనటనమెరిగి ♦ హింసను దొలగించి
మాంసపిండఘటము ♦ మరచినట్లు
నిత్య జాగ్రత్తుర్య ♦ నిపుణత గనవలె
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 35

ఆ॥ మూడురూపులుంగల ♦ మువ్వేల్పుముక్తిని
యెల్ల మేనులందు ♦ వెలుగువాని
చూపు మనసునిలిపి ♦ చూచును సుజ్ఞాని
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 36

ఆ॥ హరిహరాదులందు ♦ ఆశనువిడువారు
మూడుమూర్తుల ఘన ♦ మూలమెరుగ
ధారుణిలో వీరు ♦ దైవస్వరూపులు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 37

ఆ॥ చెట్టుకొమ్మ గొట్టి ♦ చెక్కబొమ్మగ జేసి
అమ్మ యనుచు మ్రొక్కి ♦ రిమ్మ తెవులు
తెగులుద్రుంచి యాత్మ ♦ తేజంబు గనవలె
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 33

ఆ॥ చెట్టుమీద రెండు ♦ చెన్నొందు పుట్టలు
పుట్టలందు రెండు ♦ తుట్టలుండు
తుట్టల నొకపిట్ట చట్టున బట్టెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 39

ఆ॥ పట్టినట్టిపిట్ట ♦ పైమార్గమున పోయి
ఆకసంబున నది ♦ నగ్ని లోన
ప్రాకటముగ మండి ♦ భస్మంబులాయెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 40

ఆ॥ జడలుగట్టి జపము ♦ జేయగా నేసరా
మెరుక రాకపోక ♦ లెరుగ డేని
నరకబాధ విడదు ♦ నరు డెంతవాడైన
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 41

ఆ॥ మండళములమూటి ♦ మధ్యను షోడశ
కళల పూర్ణచంద్రు ♦ కాంతియుండు
కాంతియందు మనసు ♦ కరగిన యోగంబు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 42

ఆ॥ పంచకోశఘటము ♦ పంచివివరమెగన్న
పంచ ముద్రలందు ♦ పరిఢవిల్లు
పంచముద్రలకును ♦ పంచాక్షరియె తల్లి
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 43

ఆ॥ పంచాక్షరంబులు ♦ పంచి పఠించిన
పూర్వసంచితంబు ♦ పూనిద్రుంచు
మెకముతోకబట్టి ♦ మేషము మింగురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 44

ఆ॥ కాళ్ళులేనివాడు కాశిక్షేత్రముకేగి
క్షేత్రమంతసూక్ష్మ ♦ సూత్రమెరిగి
సూత్రమెరిగితాను ♦ క్షేత్రంబు మ్రింగెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 45

ఆ॥ సకల మెరిగినట్లు ♦ సాధువు డనునట్లు
నితర వాంఛలన్ని ♦ విడచినట్లు
కప్పకొరకు పాము ♦ కాచినట్లుందురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 46

ఆ॥ సకలమెరిగితేమి ♦ సన్న్యాసియైతేమి
యున్నతదశచేత ♦ నుబ్బితేమి
మనసుసాక్షిదీరె ♦ మర్మమిదునాయేమి
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 47

ఆ॥ మనసు సాక్షియందు ♦ మరణించుటేగొప్ప
గొప్పసాక్షిబయలు ♦ గనినగొప్ప
సాక్షి బయలులోన సమసిపోవుటగొప్ప
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 48

ఆ॥ తంత్రయంత్రభ్రాంతి ♦ తాజేయునధముండు
మంత్రమహిమవేత్త ♦ మధ్యముండు
యూహవిడుచువాడు ♦ యుత్తము డనబడు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 49

ఆ॥ తీర్థయాత్రలెన్నో ♦ తిరిపెమెత్తగవచ్చు
నూర్ధ్వపుండ్రము పెట్టి ♦ యొనయవచ్చు
సార్థకంబులేదు ♦ సర్వము కాగాక
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 50

ఆ॥ తనువు తరచితరచి ♦ తత్వంబు గనుగొని
దుర్వ్యసనములెల్ల ♦ దూలగొట్టి
సర్వ మెరిగి విడచి ♦ సర్వజ్ఞుగానలె
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 51

ఆ॥ జిహ్వా రుచులుగోరు ♦ జీవుడాత్మనుగోరు
భక్తి ముక్తి గోరు ♦ భావమందు
తనువు బలువుగోరు ♦ తాను బ్రహ్మముగోరు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 52

ఆ॥ కాపు పంటగోరు ♦ కలిమి వైశ్యుడుగోరు
బలిమి రాజుగోరు ♦ భావమందు
పరుల హింసగోరు ♦ పాపాత్ముడగువాడు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 53

ఆ॥ లోకచూపుగాదు ♦ లోచూపుచూడుము
బాహ్యపలుకుగాదు ♦ పరముబలుకు
నాదు నాదుకాదు ♦ నాదంబు దశవిధం
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 54

ఆ॥ వేణునాదమువిన్న ♦ వెన్నెల పొడగన్న
నింద్రియముల బాధ ♦ విడుచునన్న
దోమతిని నదయిదు ♦ దున్నలగనుమన్న
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 55

ఆ॥ లోకదృష్టివిడచి ♦ లోకంబు లెల్లను
గడచి గగనమందు ♦ గలసియున్న
యట్టి బ్రహ్మజ్ఞాని ♦ యవని జనించునా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 56

ఆ॥ అడవియందు చెట్టు ♦ నంటియుండెడు పక్షి
చెట్టువిడచి యడవి ♦ చేరిపోయె
కలసినట్టిమాట ♦ కరకంఠు డెరుగడా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 57

ఆ॥ ఆత్మయందు జీవు ♦ డైక్యంబు బడునెట్లు
కర్పూరంపు మంట ♦ గలిసినట్లు
కదసికాలుతుర్య ♦ కరకంఠుడే తాను
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 58

ఆ॥ బ్రహ్మసంఘమునను ♦ భ్రమలువిడుచువారు
వెట్టిగురిచె బ్రహ్మ ♦ మెరిగినారొ
సంఘపతులు తాము ♦ సంతలోబడిరయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 59

ఆ॥ బియ్యేయల్ చదువుట ♦ బీఫ్ తినుటకేగాని
హాఫ్ లెస్సు యమబాధ ♦ స్టాపుగాదు
స్లీపులేనియట్టి ♦ చిత్రింబుగనరైరి
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 60

ఆ॥ ఎన్నివిద్యలైన ♦ యీజన్మతోబోవు
భ్రమలు ద్రుంచివేయు ♦ బ్రహ్మవిద్య
బ్రహ్మవిద్యనెరిగి ♦ బ్రతికిన బ్రతుకయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 61

ఆ॥ బ్రతుకుచావుకొరకు ♦ భ్రాంతి జన్మముకొరకు
వెలిగి మలగకున్న ♦ విధవబ్రతుకు
చావుబ్రతుకుసున్న ♦ సత్యంబుగనుగొన్న
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 62

ఆ॥ భూతపూజలనెడి ♦ బురద మేనునబూయ
బాధ లెందునైన ♦ బాయగలదె
బాధ తీఱిపోవు ♦ భగవంతు డొకడన
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 63

ఆ॥ దేవతార్చనకయి ♦ దేహశుద్ధినిజేయ
ముట్టుకుండ నీట ♦ ముంచినట్లు
దేహశుద్ధిజేయ ♦ దేవునిదెలియునా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 64

ఆ॥ మనసుశుద్ధిజేసి ♦ మాయను వధియించి
తెలివిలోన తెలివి ♦ తేటపరచి
తేటమీటదాటి ♦ తెగిపోతె చాలురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 65

ఆ॥ బ్రహ్మ మిందునందు ♦ బ్రబలుచునుండగా
బ్రహ్మ మెరుగువాడు ♦ బ్రాహ్మణుండు
ఎరిగియున్న సర్వ ♦ మేకమంచునునెంచు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 66

ఆ॥ కావిపంచగట్టి ♦ కలియోగిగావచ్చు
మేడిపండురీతి ♦ మెలగవచ్చు
జడుడుజ్ఞానమూన ♦ జగములు గృంకునా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 67

ఆ॥ బోడితలలు జేసి ♦ బూడిద మెయిబూసి
తిరుగుచుండు ధరను ♦ తిండికొఱకు
తిండిపోతులేని ♦ తీర్మానమెరుగునా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 68

ఆ॥ జాతి మతముఱోత ♦ జన్మఖర్మముఱోత
అధిక ధనముపైని ♦ యాశఱోత
మురికితనువు జూచి ♦ మురియుచుండుటఱోత
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 69

ఆ॥ క్రీస్తుక్రీస్తుయనుచు ♦ కీలెరుంగనివారు
మాదెమతముచాల ♦ మంచిదండ్రు
ఇతర మతములకును ♦ ఈశు డెవ్వడోగదా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 70

ఆ॥ పాపపుణ్యములకు ♦ పరమేశ్వరుడెకర్త
రాజ్యభరముమోయు ♦ రాజెకర్త
మధ్యవారలెల్ల ♦ మహారాజు లగుదురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 71

ఆ॥ అద్దమందు నిద్ద ♦ రమరిన యోగంబు
బుద్ధిశాలి మెరుగు ♦ భ్రామ్యమందు
గాన లేనివాడు ♦ ఘనుడెట్టులాయెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 72

ఆ॥ ఆత్మ గననివాని ♦ కద్వయితములు మెందు
నిజమెరుగనివాని ♦ నిష్ఠ మెందు
లంచగొట్టువాని ♦ లౌకికములు మెందు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 73

ఆ॥ అల్ల ఖుదయటంచు ♦ అరువగా నేసరా
యుల్లమందున ఖుద ♦ యునికి దెలియ
బనికి ముసల్మాన్ ♦ బద్మాన్ హైవాగయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 74

ఆ॥ మ్రొక్కులిడితె నేమి ♦ మక్కా మశీదుల
కుపవసములు చేసి ♦ యుడిగితేమి
దేహమందునాత్మ ♦ దెలియని ఘనమేమి
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 75

ఆ॥ వసుధస్వర్ణ మొకటి ♦ వన్నె చిన్నె ల్వేరు
మనసు యొకటిగాని ♦ మతము వేరు
రూఢిశివుడొకండె ♦ రూపముల్ వేరయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 76

ఆ॥ ఇనుపదారిమీద ♦ నింజను జనునట్లు
వడిపయోధిపైని ♦ యోడజనును
అరయ తనువులోను ♦ దిరుగుచుండును నాత్మ
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 77

ఆ॥ గగనమందు నురుము ♦ గర్జించినట్లుండు
నడవియందు సింహ ♦ మరచినట్లు
నింటికప్పుమీద ♦ నీశుడిట్లుండురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 78

ఆ॥ లోవెలి బయలాయె ♦ లోకంబు లేదాయె
బయలు బ్రహ్మమంచు ♦ బలుకుచుండ్రు
బలుకువాడు వేరు ♦ బయలు వేరాయెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 79

ఆ॥ కల్లునీళ్ల ద్రాగి ♦ కడుపెద్ద ననువాడు
జీవహింసవాడు ♦ జూదగాడు
జారచోరులెల్ల ♦ జెందెదరు నరకంబు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 80

ఆ॥ నక్కకుక్కలరవ ♦ నల్లనా తెల్లనా
ఊరపందు లరవ ♦ నురుముయగున
గాడెదరువ సింహ ♦ గర్జన మెట్లగు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 81

ఆ॥ శుకముబల్కునట్లు ♦ శునకంబుబల్కునా
కాలు నరసిపట్టి ♦ కరచుగాక
నీచు డెరుగలేడు ♦ నిర్గుణబ్రహ్మంబు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 82

ఆ॥ జీవబంధభ్రాంతి ♦ చిక్కనిరువదియైదు
నినుపసంకెలలను ♦ నింద్రియముల
బంధముక్తులవడిఁ ♦ బాయగవలెజీవి
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 83

ఆ॥ కర్త తానగుటచె ♦ కర్మ గలిగెనుగాని
కర్త లేక కర్మ ♦ కలుగబోదు
కర్మబంధమువిడి ♦ కడ తేరనిచ్చునా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 84

ఆ॥ తామరాకు నీట ♦ దడియుచునున్నట్లు
నద్దమందుబింబ ♦ మంటినట్లు
నాత్మభ్రాంతికిట్లు ♦ ననుమానమాయెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 85

ఆ॥ తామరాకునీట ♦ దడియకనున్నట్లు
నద్దమందు బింబ ♦ మంటనట్లు
నాత్మభ్రాంతిపోతె ♦ యనుమానముడుగురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 86

ఆ॥ ఆత్మభావమునను ♦ నఖిలంబు తానాయె
జీవభావమునను ♦ జిక్కిపోయె
నాత్మజీవులకొక ♦ యనుమాన మేకదా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 87

ఆ॥ తన్ను దానుగన్న ♦ తత్వజ్ఞుడేజ్ఞాని
కన్నుమిన్ను గలియు ♦ గ్రమముగాను
నెన్న తరముగాని ♦ దేకప్రకాశంబు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 98

ఆ॥ ధనము బలమువల్ల ♦ దారిద్ర్యములు కట్టు
దొంగబలమువల్ల ♦ దోవకట్టు
తన్ను దానుగన్న ♦ దత్వంబు కట్టురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 89

ఆ॥ మంత్రిబలమువల్ల ♦ మహినీతలముకట్టు
తత్వబలమువల్ల ♦ దలపుకట్టు
గురునిబలమువల్ల ♦ గుణములుకట్టురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 90

ఆ॥ ఎలుకకన్నమందు ♦ నేనుగ యున్నట్లు
గప్పనోటబాము ♦ కదలనట్లు
మాయజిక్కిజీవి ♦ మసలకయుండురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 91

ఆ॥ ఎరుకసంఘటనమె ♦ యెల్లలోకంబులు
ఎరుకసంఘటనమె ♦ యెరుకమరపు
ఎరుకమరపురెంటి ♦ నెరిగిన దెరుకయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 92

గీ॥ వెఱ్ఱిగురువుజ్ఞాన ♦ మెందున లేదని
చెప్పిబోధజేయు ♦ శిష్యునకును
ఎరుకఘటమువిడచి ♦ యేలాగుబోయెరా?
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 93

ఆ॥ ఎరుకవచ్చిపోవు ♦ టెరుగని భావజ్ఞ
నచలతత్వవేది♦ యనుట యెట్లు
ఎరుక విడనివాడు ♦ ఎట్టివేదాంతయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 94

ఆ॥ గురువుశిష్యుడనెడి ♦ గురుతును జూపించి
గురుతుజంపినట్టి ♦ గురువుదలప
నట్టివాడు గురుం ♦ డవనీస్థలినిజూడ
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 95

ఆ॥ తెలిసినామటంచు ♦ దేటగా బలికేరు
ఏమి తెలిసినారొ ♦ యెంతవరకొ
తెలివిబయలుగాంచి ♦ తెగిపోవు టెరిగిరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 96

ఆ॥ లోవెలి గురివిడచి • లోకమందున దిరుగు
లోకవృత్తి తాను • లేక సేయు
లేనిబ్రహ్మగుట్టు • లోకులెల్లెరుగును
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 97

ఆ॥ ఉన్నవానిరీతి • నుర్విని గనబడ్డ
లేనివాడు ధరను • లేనివాడు
లోనివానిగుట్టు • లోకమెల్లెరుగును
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 98

ఆ॥ కఱపరాళ్ల గలసి • ఘనరత్నమున్నట్లు
బకగణములహంస • బ్రతికినట్లు
పరుల గలసి జ్ఞాని • పరవాసియైయుండు
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 99

ఆ॥ హరుడ గురుడ నేను • హంసద్వయము నేను
నేను సర్వమెల్ల • నెరుక నేను
ఏనుగాని దెదియొ • యేర్పాటు జేయరా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 100

ఆ॥ ఏదినేనుగాను • ఎందునగనరాను
అంతటగన పూర్తి • నమరినాను
భ్రాంతిదీరిపోతె • బ్రహ్మంబు నేనయా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 101

ఆ॥ పాలలోను పెరుగు ♦ పరిఢవిల్లినయట్లు
పెరుగులోమజ్జిక ♦ పెనగినట్లు
మజ్జికందు వెన్న ♦ మలయుచునున్నది
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 102

ఆ॥ తనువులోనెతనువు ♦ తార్కాణముగనిట్లు
నాల్గుతనువులట్లు ♦ నమరియుండు
తనువుల తలనొక్క ♦ తారకతూటుండు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 103

ఆ॥ ఇట్టితూటుగాంచు ♦ నట్టివాడేపూర్ణ
మందగలుగు నన్యు ♦ లందలేరు
అందునట్టివార ♦ లధికులనంబడు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 104

ఆ॥ గోతినున్న హంస ♦ కొలమకేగినగాదు
ప్రాణముండగోయి ♦ ప్రాప్తమగును
ప్రాణిగలని తెలివి ♦ బ్రహ్మముగాబోదు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 105

ఆ॥ ఎరుపు తెలుపునలుపు ♦ లెనసినీలంబుండె
నీలమందుజ్ఞాన ♦ నికరముండె
నికరమందుబోధ ♦ నిర్గుణమాయెరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 106

ఆ॥ తరుగువిరుగులేదు ◆ తర్కించిచూచిన
తరముగానిబయలు ◆ తరచి తరచి
తరచిపూర్ణమందు ◆ తనుతీరవలెనయా
సర్వపాపభంగ ◆ సాక్షిలింగ॥ 107

ఆ॥ స్థూలమరయబ్రహ్మ ◆ సూక్ష్మంబుశివుడాయె
కారణంబువిష్ణు ◆ కల్లలాయె
మచ్చతలనునుండు ◆ మహాకారణమునకు
సర్వపాపభంగ ◆ సాక్షిలింగ॥ 108

ఆ॥ మచ్చనిశ్చయంబు ◆ మహనీయుడెరుగును
స్వచ్ఛమైనమచ్చ ◆ స్వానుభవము
మచ్చరహితమైన ◆ మరిజన్మలేదురా
సర్వపాపభంగ ◆ సాక్షిలింగ॥ 109

ఆ॥ బ్రహ్మగుజ్జమాయె ◆ భవుడు కళ్ళెంబాయె
రాష్ట్రమందుబారె ◆ రౌతు విష్ణు
కల్లరాష్ట్రమేలె ◆ గలియనుభూపతి
సర్వపాపభంగ ◆ సాక్షిలింగ॥ 110

ఆ॥ అశ్వరౌతుకల్లె ◆ మనునవస్థలుగూలె
మాయరాజు భ్రాంతి ◆ మాసిపోయె
పరుగు పారిపోయె ◆ పరతత్వమేమిటో
సర్వపాపభంగ ◆ సాక్షిలింగ॥ 111

ఆ॥ బయలు వట్టిదనుచు ♦ భావింతు రిలలోను
ఉన్న దనిన సాక్షి ♦ యునికిపట్టు
పట్టువిడచి సాక్షి ♦ పరుగిడ స్పష్టంబు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 112

ఆ॥ బట్టబయలుగాంచి ♦ భ్రాంతినివిడువాడు
పుట్టబోడుమరల ♦ గిట్టబోడు
పుట్టిపుట్టనట్టి ♦ పుణ్యాత్ముడాతడు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 1 3

ఆ॥ బయలుకంటె వేరు ♦ బ్రహ్మంబుగలదను
కర్మనకునుభ్రాంతి ♦ కదలిపోదు
రూపరహితమైన ♦ ప్రాపుగానున్నది
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 114

ఆ॥ నాదుబిందుకళల ♦ నాణ్యంబుదెలిసిన
నదియకాదుజ్ఞాన ♦ మదియుకాదు
కళలు పదియునారు ♦ కడశోడశియెగాన
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 115

ఆ॥ అవస్థ లత్రియంబు ♦ లనునవినాలుగు
నాల్గువేదములను ♦ నమరియుండు
వేదసారమైన ♦ వెల్గు పైగానుండు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 116

ఆ॥ ఇట్టివెలుగుగలిసి ♦ నట్టి పరిపూర్ణంబు
అట్టహాసము గడు ♦ బట్టబయలు
మట్టిపాలు తనువు ♦ మరి తాను బ్రహ్మమా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 117

ఆ॥ యోగములలో రాజ♦యోగంబుగడు హెచ్చు
నాదములలో ప్రణవ ♦ నాద మెచ్చు
తనువెరుకలులేని ♦ తత్వమె హెచ్చయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 118

ఆ॥ ఎరుకపోవుమార్గ ♦ మెన్ని యుగములైన
తరమె యోచనమున ♦ తరచిచూడ
బండితులయినను ♦ పరికింపలేరయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 119

ఆ॥ యోగినైనరాజ ♦ యోగినైననుగాని
భోగినైననుభువి ♦ జోగినైన
జెప్పతరముగాదు ♦ చైతన్యరహితము
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 120

ఆ॥ ఆర్యులార, యెరుక ♦ యురుగుమార్గము విన
రండు వేగ, మిగుల ♦ రహస్యమిదియె
యిట్టిరహస్య మెరుగ ♦ నిలకోటి కొకడెగా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 121

ఆ॥ గృహము విడచి నరుడు ♦ గురిలేకజనురీతి
బొందివిడచి జీవి ♦ పోవుపగిది
గురునిబోధ వినిన ♦ గురుతటులరుగురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 122

ఆ॥ ఆకసమున భాను ♦ డస్తమించిన గతి
వెలుగుచున్న జ్యోతి ♦ మలగురీతి
తనువు విడచి యెరుక ♦ తన్మయంబొందురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 123

ఆ॥ ఒడలినున్న జ్వరము ♦ వదలిపోయినయట్లు
గగనమందుగుండు ♦ గలసినట్లు
సాక్షిరహితమిట్లు ♦ వీక్షింపవలెనయా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 124

ఆ॥ సుప్తిలోనజ్ఞప్తి ♦ చూడకనున్నట్లు
పాటిజగతిలేదు ♦ పరములేదు
తెలివిరహితమైతె ♦ తెలియనెవ్వరులేరు
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 125

ఆ॥ గొల్లవానిగన్న ♦ గొత్తగంతులువేయు
గటికివానిగన్న ♦ గట్టుజగతి
బ్రహ్మనిధినిగన్న ♦ భ్రాంతులు కట్టురా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 126

ఆ॥ జగము నిజముగాని • చంచలంబు దెలియుడు
ఎండమావులట్టు • లుండుగాన
స్వప్నభ్రాంతి జగతి • జెప్పనసాధ్యంబు
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 127

ఆ॥ నీరుచొరగలోతు • నీతగాడెరుగును
తత్వగుట్టుజ్ఞాని • తప్పకెరుగు
నచలబ్రహ్మగుట్టు • నజ్ఞానుడెరుగునా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 128

ఆ॥ అచలము పరిపూర్ణ • మనుచుబల్కనగాదు
సూచనపై నెక్క • సూటిదెలియ
సాధనంబు లేక • సాగిపోవునెరుక
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 129

ఆ॥ అచలపూర్ణుడరయ • నంతట నుండును
దేహరహితుడగుట • దెలియలేరు
ఏవుమీరరూప • మెందునలేదయా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 130

ఆ॥ అజుడుశివుడుమాయ • హరిదిక్పతులుమాయ
తనువుతానుమాయ • ధనముమాయ
సర్వసాక్షిమాయ • సర్వంబుమాయరా
సర్వపాపభంగ • సాక్షిలింగ॥ 131

ఆ॥ హరుడుగురుడుమాయ ♦ హంసద్వయముమాయ
మెరుకమరపునెరుగు ♦ నెరుకమాయ
పంచభూతగణము ♦ పరికింప మాయరా
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 132

ఆ॥ మంగళంబుసర్వ ♦ మహికాంతరాళుకు
మంగళముభళిభళి ♦ మద్గురునకు
మంగళంబుపూర్ణ ♦ మార్తాండమౌళికి
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 133

ఆ॥ వినుము వసుధయందు ♦ వీరరాఘవగోత్రి
వంశజుండ నగుచు ♦ వరలుచుండు
నాత్మరహిత కొప్పు ♦ లాదినారాయుడ
సర్వపాపభంగ ♦ సాక్షిలింగ॥ 134

గీ॥ మహిని వైశాఖపట్టణ ♦ మందు శార
దా మకుటనాఖ్య నలరు ము ♦ ద్రాలయమున
వరలు నాలి యప్పలస్వామి ♦ వలన ముద్దు
గులుకు ముద్రాక్షరంబులు ♦ గూర్పబడియె॥

సంపూర్ణము.

13405